క్లుప్తంగా

బీజేపీతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న సురేశ్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: బీజేపీతోనే అన్నిరంగాల అభివృద్ధి సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో బీజేపీకే మద్దతుగా నిలవాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి కోరారు. పెద్దపల్లిలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు తమ స్వార్థ ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలోని సహజ సంపదను దోచుకునేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు ఒక్కటయ్యారని విమర్శించారు. పెద్దపల్లి ప్రాంతంలో రైస్‌మిల్లులు, ఇటుక పరిశ్రమ, ఇసుకరీచ్‌లలో దోపిడీ దందా సాగిస్తున్నారన్నారు. నాయకులు మనోహర్, సయ్యద్ ఫయాజ్, ప్రమోద్‌కుమార్, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్, శ్రీధర్, శ్రీకాంత్, రవితేజ, ప్రశాంత్, వేణు, వంశీ ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని రాయదండి గ్రామంలో శనివారం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.10లక్షల నిధులతో గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధర్మాజి కృష్ణ, ఉపసర్పంచ్ తాని పవన్‌కుమార్, కార్యదర్శి జ్యోత్స్న, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'గాయత్రీ'లో గ్రీన్ డే



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ విద్యానికేతన్‌లో శనివారం గ్రీన్‌డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కరస్పాండెంట్ అల్లెంకి రజనీ, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దిన్, నవీన్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లి గ్రామంలోని ఈశ్వరకృప వృద్ధాశ్రమంలో బండారి రాజయ్య జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు బండారి సుశీల, సుజాత ప్రసాద్, లతశ్రీనివాస్ శనివారం వృద్ధులకు అన్నదానం చేశారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు గంట సత్తయ్య, వాసు, సీతారాంరెడ్డి ఉన్నారు.

'కుటుంబ వ్యవస్థను బలోపేతం చేద్దాం'

పెద్దపల్లిరూరల్: కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసేందుకు మహిళల్లో చైతన్యం పెంచుటకు పాటుపడదామని బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధి సుప్రియదీదీ అన్నారు. పెద్దపల్లిలోని పలు కళాశాలల్లో శనివారం కుటుంబ వ్యవస్థలో మహిళల పాత్ర కీలకం అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం మారుతున్న సమాజంలో మహిళలు ఒత్తిడికి గురవుతున్నారని, వాటిని అధిగమించేందుకు యోగా, ధ్యానంతో పాటు పలు అంశాలపై అవగాహన పెంచుకుంటే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నిర్వాహకురాలు సారిక, రూప, మీనాక్షి, కామాక్షి, బద్రి, డీఆర్‌డీఓ పీడీ శ్రీధర్, ఏపీడీ సునీత, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి తదితరులున్నారు.

గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలి



నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

పెద్దపల్లిరూరల్: ఉద్యోగ పోటీ పరీక్షలు ఒకే నెలలో నిర్వహిస్తుండడం సరికాదని, తమపై ఒత్తిడి పెరుగుతోందని నిరుద్యోగ అభ్యర్థులు అన్నారు. పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో శనివారం వారు నిరసన వ్యక్తం చేశారు. గ్రూప్–2 పరీక్షను మూడునెలల పాటు వాయిదా వేయాలని కోరారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి సామాజిక మాధ్యమాల ద్వారా తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చంద్రమౌళి, సాత్విక్, రవి, సంపత్ పేర్కొన్నారు.

8న మహాలక్ష్మి ఆలయంలో చీరల వేలం

మంథని: మంథనిలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను 8న ఆలయంలో వేలం ద్వారా విక్రయిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ మారుపాక చంద్రకళ తెలిపారు. ఆసక్తి గల భక్తులు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రామగుండం: పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలోని సుబోధ్ స్కూల్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఉన్నప్పటికీ కంచె లోపల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి విద్యుత్ సరఫరా అయ్యే తీగలు, స్తంభాలకు అల్లుకున్నాయి. సమీపంలోని పాఠశాల విద్యార్థులు నిరంతరం అదే రహదారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. దీనిపై సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు ప్రమాదం జరగకముందే స్పందించి కంచె లోపల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి రక్షణ చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



గండిని పూడ్చివేయండి సారూ..

ధర్మారం: ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామ శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డీ-83 ప్రధానకాలువ రోడ్డుకు గండిపడి ప్రమాదకరంగా మారింది. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై నీరు నిలవడంతో కెనాల్‌లోకి పడిన పెద్ద గండి ప్రమాదకరంగా మారింది. అయితే రోడ్డు మధ్యలో నుంచి కెనాల్ లైనింగ్ వరకు దాదాపు 12ఫీట్ల లోతు గండి పడటంతో రైతులు పంట చేలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. పత్తిపాక క్రాస్‌రోడ్డు నుంచి ఈ కెనాల్ వెంట వివిధ గ్రామాలకు వెళ్తుంటారు. రాత్రివేళ వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఈ గుంతలో పడే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ఈ గుంతను పూడ్చి మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న రీజియన్ చైర్మన్ రాజన్న

సుల్తానాబాద్: పర్యావరణాన్ని పరిరక్షించేది మొక్కలేనని వాసవి వనిత క్లబ్ రీజియన్ చైర్మన్ అల్లంకి రాజన్న అన్నారు. సుల్తానాబాద్‌లో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనిత క్లబ్ ద్వారా పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి జోన్ చైర్మన్లు బాదం వాణి, అల్లంకి లింగమూర్తి, అధ్యక్షుడు కాసం సత్యనారాయణ, యాంసాని రమాదేవి, హరిప్రసాద్, రాజశేఖర్, ప్రధాన కార్యదర్శులు రవీందర్, విక్రమ్, కోశాధికారులు అల్లంకి హరీశ్‌కుమార్, ఆంజనేయులు, సాయి, కళావతి, కొమురవెల్లి భాస్కర్, శ్రీనివాస్, రాజు, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

అన్నపూర్ణకాలనీ.. సౌకర్యాలేవీ?



రోడ్డుపై మొక్కలు నాటి నిరసన తెలుపుతున్న అన్నపూర్ణకాలనీ ప్రజలు (ఫైల్)

- ప్రభావిత ప్రాంతాన్ని పట్టించుకోని ఎన్టీపీసీ సంస్థ
- రోడ్లపై మొక్కలు నాటి నిరసన తెలిపినా.. ఫలితం శూన్యం
- ఎన్టీపీసీ సీఎస్సార్ నిధుల విడుదల కోసం ఎదురుచూపులు

జ్యోతినగర్: సుందర రామగుండమే లక్ష్యంగా, ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తామని అంటున్న మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నపూర్ణకాలనీ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో జాప్యం చేయడంలో ఆంతర్యం ఏంటో అని చర్చించుకుంటున్నారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్‌లోని అంతర్గత రోడ్లు పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్టీపీసీ రామగుండం విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన భూనిర్వాసితుల నివాసాల కోసం అన్నపూర్ణకాలనీలోని కొంతభాగాన్ని సంస్థ కేటాయించింది. పునరావాస ప్రాంతంగా ఉన్న కాలనీని ఎన్టీపీసీ యాజమాన్యం అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాల్సి ఉండగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కాలనీలోని అంతర్గత రోడ్ల గుంతల్లో వరదనీరు వచ్చి చేరి గుంతలు కనిపించకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని రోడ్లపై మొక్కలు నాటి నిరసనలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల స్పందించి అన్నపూర్ణకాలనీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

పట్టించుకోని ఎన్టీపీసీ సంస్థ

ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యం ప్రభావిత, పునరావాస ప్రాంతాలను పట్టించుకోవడం లేదని సంబంధిత ప్రాతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సంస్థ దినదినాభివృద్ధి చెందుతుండగా ప్రభావిత ప్రజల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్లాంటు అభివృద్ధి చెందుతున్న క్రమంలో సీఎస్సార్ నిధులను అదే మొత్తంగా విడుదల చేయాల్సి ఉండగా తూతూ మంత్రంగా పనులు చేపట్టడంతో ప్రజలు నిరసన చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

రోడ్డు సరిగా లేదు



మా ఇంటికి పోవాలంటే రోడ్డు సరిగా లేదు. వర్షాకాలం కావడంతో కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా మారడంతో ఇబ్బంది పడుతున్నాం. మున్సిపాలిటీ అధికారులు పట్టించుకుని ప్రజల సమస్యలు పరిష్కరించాలి.
– లస్మమ్మ, అన్నపూర్ణకాలనీ

దోమల మందు స్ప్రే చేయాలి



రోడ్డుపై గుంతలు ఉండటంతో మురుగు నీరు, వరద నీరు నిల్వ ఉంటోంది. బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో పెద్ద గుంతగా మారి పందులకు ఆవాసాలుగా మారింది. దోమలు, ఈగలు పెరిగిపోయాయి. దోమల మందు స్ప్రే చేయాలి.
– లక్ష్మి, అన్నపూర్ణకాలనీ

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల స్వీకరణ

సుల్తానాబాద్/ఓదెల/ఎలిగేడు: గృహలక్ష్మి పథకానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సుల్తానాబాద్ తహసీల్దార్ రజిత, ఎలిగేడు తహసీల్దార్ జె.స్వర్ణ, ఓదెల తహసీల్దార్ యాకన్న తెలిపారు. ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయం, మండల పరిధిలో ఉన్న లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నివాస స్థలం ఉండి ఇల్లు లేని బలహీన వర్గాలకు చెందినవారు, ఆహార భద్రత కార్డ్ కలిగి ఉండి, జీవో నెం.59లో లబ్ధి పొందని వారు గృహలక్ష్మి పథకానికి అర్హులని వివరించారు. దరఖాస్తుతో పాటు ఖాళీస్థలం హక్కు పత్రాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్ ప్రతులు సమర్పించాలన్నారు. ఈ మేరకు స్వీకరించిన దరఖాస్తులను 20 నుంచి విచారణ జరిపి 25వ తేదీన ఇళ్ల మంజూరు జాబితా ప్రకటిస్తామని తహసీల్దార్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిపై పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్య అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాల్వశ్రీరాంపూర్‌లో బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనులు కనబడటం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అనుచిత వ్యాఖ్యలు చేసిన నాయకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు రాజకొమురయ్య, సర్పంచులు నాగార్జున్‌రావు, మల్లారెడ్డి, శ్యాం, మాజీ సర్పంచులు జక్కె రవి, మాజీ ఎంపీటీసీ సుముకం మల్లారెడ్డి, నాయకులు చందు, నూనేటి కుమార్, రవి, వెంకటేశ్, శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.

నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయం



మాట్లాడుతున్న ఎంపీపీ బాలాజీరావు

సుల్తానాబాద్: స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మార్చే వారు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని విమర్శించడం విడ్డూరంగా ఉందని ఎంపీపీ బాలాజీ రావు అన్నారు. మండల కేంద్రంలోని వైశ్య భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో సర్పంచులు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్లతో పాటు వివిధ రంగాల్లో యువతకు పెద్ద పీట వేసిన ఎమ్మెల్యేపై వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని హితవు పలికారు. పెద్దపల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా మళ్లీ ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. డబుల్‌రోడ్డు నిర్మాణాన్ని చేపట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వ్యక్తి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, సింగిల్‌విండో చైర్మన్లు శ్రీగిరి శ్రీనివాస్, జూపల్లి సందీప్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు పురం ప్రేంచందర్‌రావు, పారుపల్లి గుణపతి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ బోయిని రాయమల్లు, రమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అమ్ముల భూమయ్య, తిప్పారపు దయాకర్, వాహిద్ పాల్గొన్నారు.

ట్రినిటి పాఠశాలలో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఉన్నత పాఠశాలలో శనివారం నమూనా ఎన్నికలు నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యం వివరించడంతో పాటు ఎన్నికల నిర్వహణ విధానంపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు దోహదపడుతుందని ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అన్నారు. ప్రిన్సిపాల్ రమేశ్‌చంద్ర, కుమారస్వామి, ఇన్నారెడ్డి పాల్గొన్నారు.

స్వార్థ ప్రయోజనాల కోసమే పార్టీ ఫిరాయింపు



మాట్లాడుతున్న సురేందర్, నాయకులు

పెద్దపల్లిరూరల్: స్వార్థ ప్రయెజనాలకోసం పార్టీ ఫిరాయించిందే కాకుండా కాంగ్రెస్‌లో చేరిన వాళ్లంతా కాపులేనని ప్రచారం చేసుకోవడం సమంజసం కాదని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జడల సురేందర్, నాయకుడు ఉప్పు రాజు అన్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే రాజమల్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య కాంగ్రెస్‌లో కలిసినంత మాత్రాన కాపుసంఘం నాయకులంతా కాంగ్రెస్‌లో చేరినట్టేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని ఎత్తులు వేసినా వచ్చే ఎన్నికల్లో మళ్లీ దాసరి మనోహర్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమన్నారు. కౌన్సిలర్లు భిక్షపతి, చంద్రశేఖర్, నాయకులు శ్రీధర్, రవి, చంద్రమౌళి, రమేశ్, మొబిన్, తబ్రేజ్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నివాళి అర్పిస్తున్న మక్కాన్‌సింగ్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన తూళ్ల రాజేశ్ కుమారుడు శిక్షిత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అదేవిధంగా ఎల్లంపల్లికి చెందిన గుమ్ముల రాజనర్సయ్య మృతిచెందాడు. బాధిత కుటుంబాలకు శనివారం డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఠాకూర్ పరామర్శించారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహేశ్, మాజీ ఎంపీపీ రాజలింగం, కిరణ్‌కుమార్‌గౌడ్, హరిప్రసాద్, సతీశ్, విజయ్, గౌస్‌బాబా, కృష్ణ, వెంకట్, అక్షయ్ ఉన్నారు.

బహుజన రణభేరి పోస్టర్ ఆవిష్కరణ



పెద్దపల్లిరూరల్: పట్టణంలో శనివారం బహుజన రణభేరి పోస్టర్‌ను బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆవిష్కరించారు. బొప్పదండిలో ఆదివారం నిర్వహించనున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. నాయకులు శేషాద్రి, స్వప్నగౌడ్, దుర్గయ్య, గోపాల్‌యాదవ్, అనిల్, ఎండీ రియాజ్, శోభ, ప్రశాంత్ ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: రామగుండం ప్రాంతంలో ఐటీ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు అసెంబ్లీలో మంత్రి కేటీఆర్ ప్రకటనను హర్షిస్తూ స్థానిక మార్కండేయ కాలనీలోని పేస్ కంప్యూటర్ ఆధ్వర్యంలో నిర్వాహకులు అడప వనితశ్రీనివాస్, విద్యార్థులు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, ఈశ్వర్, ఎమ్మెల్యే చందర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కన్నాల సింగిల్‌విండో ఆధ్వర్యంలో..

పాలకుర్తి: రైతులకు రుణమాఫీ చేస్తూ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ శనివారం పాలకుర్తి మండలం కన్నాల సింగిల్‌విండో పాలకవర్గం ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా రాణాపూర్ గ్రామంలో మహిళా కూలీలు, రైతులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కాంట్రాక్టు కార్మికుల చర్చలు వాయిదా



చర్చల్లో పాల్గొన్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కార్మిక సంఘాల నాయకులు చేస్తున్న ప్రయత్నాలు కొంత మేర సఫలీకృతమయ్యేనా అని కార్మికులు చర్చించుకుంటున్నారు. శనివారం ఎన్టీపీసీ యాజమాన్యంతో జరుగుతున్న చర్చల్లో నాయకులు పాల్గొన్నారు. కాగా 32వ సారి జరిగిన చర్చల్లో ఎలాంటి ఒప్పందం జరగకపోవడంపై కార్మికులు నిరాశతో ఉన్నారు. ఈనెల 8,9వ తేదీల్లో మెరుగైన చర్చలు జరిపేందుకు కార్మిక సంఘాల నాయకులు, యాజమాన్యం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పదో తేదీన ఆర్‌ఎల్‌సీ సమక్షంలో చర్చలు జరుగనున్న నేపథ్యంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుల అలవెన్సులపై జరిపిన సమ్మెలో కార్మికుల పక్షాన ఒక నిర్ణయం తీసుకున్న క్రమంలో ఎన్టీపీసీ రామగుండం కార్మికులకు సైతం తీపి కబురు చెప్పేందుకు ముందుకు వస్తున్నట్లు సమాచారం.

సంక్షిప్త వార్తలు

✦ సింగరేణిలో అమలు చేయాలి

గోదావరిఖని(రామగుండం): జేబీసీసీఐ నిర్ణయం ప్రకారం కోల్‌ఇండియా మెడికల్ ట్రస్ట్ బోర్డు సమావేశం ఈనెల 4న కోల్‌కత్తాలో జరిగిందని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు పేర్కొన్నారు. మెడికల్ స్కీంలో చేరే వారు ఈఏడాది డిసెంబర్ వరకు చేరవచ్చన్నారు. ఈఅవకాశాన్ని సింగరేణిలో కూడా అమలు చేయటానికి యాజమాన్యం వెంటనే సర్క్యులర్ విడుదల చేయాలని కోరారు.

✦ అర్హులందరికీ బీసీబంధు ఇవ్వాలి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం చేతివృత్తుల వారికోసం ప్రకటించిన రూ.లక్ష సాయం పథకాన్ని అర్హులైన విశ్వ బ్రాహ్మణులందరికీ వర్తింపజేయాలని విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కట్ల రాజానందం కోరారు. పెద్దపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.

✦ లయన్స్‌క్లబ్ నిరుపేదలకు సేవ చేస్తుంది

జ్యోతినగర్: నిరుపేదలకు అండగా లయన్స్ క్లబ్ సేవలందిస్తుందని శతాబ్ది లయన్స్ క్లబ్ బాధ్యులు ముకుందరెడ్డి అన్నారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం కార్పొరేషన్ అన్నపూర్ణకాలనీ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలో నిరుపేద చంద్రమ్మ ఇంటిని సందర్శించారు. కొడుకు, కోడలు మృతి చెందడంతో మనుమరాలు పల్లవి ఒంటరైంది. సీతారామ సేవాసమితి వ్యవస్థాపకురాలు గోలివాడ చంద్రకళ, కార్పొరేటర్ రమణారెడ్డి రూ.2వేలు, రాజాగౌడ్ రూ.వెయ్యి చంద్రమ్మకు అందించారు.

✦ నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలి

సుల్తానాబాద్: భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలని సీపీఐ మావోయిస్టు జేఎండబ్ల్యూపి డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. వరదల్లో చిక్కుకొని మరణించిన వారికి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.10లక్షల పరిహారం అందజేయాలని కోరారు.

✦ డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

గోదావరిఖని: మద్యం తాగి వాహనం నడిపిన డ్రైవర్‌కు జైలు శిక్ష పడింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం మల్లేశ్ మద్యం తాగి వాహనం నడుపుతూ రెండోసారి పట్టుబడ్డాడు. శనివారం సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ డి.వెంకటేశ్ ఎదుట హాజరుపర్చగా జైలుశిక్ష విధించారు. భవిష్యత్‌లో మళ్లీ మద్యం తాగి వాహనం నడిపితే జైలు శిక్షతో పాటు లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.

✦ రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ రాజీవ్ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో గోదావరిఖని వైపు బైక్‌పై వెళుతుండగా వెనకవైపు నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గోదావరిఖనికి చెందిన రఘుకు తీవ్రగాయాలైనాయి. స్థానికులు గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన



పరిశీలిస్తున్న తహసీల్దార్ యాకన్న

ఓదెల: మండలంలోని పిట్టలఎల్లయ్యపల్లె, కనగర్తి, గుండ్లపల్లె గ్రామాల్లోని పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ యాకన్న శనివారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో పోలింగ కేంద్రాల్లో ర్యాంప్, కిటికీలు, విద్యుత్ సరఫరా, మంచినీటి సౌకర్యాల గురించి ఆరా తీశారు. రాబోయే ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండటం కోసం పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ బండ రాజేందర్, ప్రజాప్రతినిదులు, సిబ్బంది ఉన్నారు.